సాక్షి చిత్తూరు

బుధవారం । 4 । సెప్టెంబర్ । 2024



టీచర్.. మమ్మల్ని విడిచి వెళ్లొద్దు

గంగవరంలో బదిలీపై వెళ్తున్న టీచర్‌ను తమను వదలి వెళ్లొద్దంటూ విద్యార్థులు కన్నీళ్లు పెట్టుకున్నారు. - 12లో



విజయవంతంగా సదస్సు

ఔషధాల వాడకంతో తలెత్తే దుష్ప్రభావాలపై తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలలో వైద్య విద్యాసదస్సు నిర్వహించారు. - 12లో



పక్కా ప్రణాళికతోనే చోరీ

చంద్రగిరిలోని ఎస్‌బీఐ ఏటీఎంలో పక్కా ప్రణాళికతోనే నిందితులు చోరీకి పాల్పడినట్లు తిరుపతి పోలీసులు వెల్లడించారు. - 12లో

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని అన్ని డివిజన్ కార్యాలయాల్లో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఆయా డివిజన్ల వినియోగదారులు సమస్యలను తెలపాలన్నారు. వాటిని నమోదు చేసుకుని పరిష్కారం కోసం అధికారులు కృషి చేయనున్నట్లు చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి ఫిర్యాదులు తీసుకుంటారని వివరించారు.

గురుపూజోత్సవం వేడుకలు రేపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఈ నెల 5వ తేదీ జిల్లా స్థాయి గురుపూజోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురుపూజోత్సవం వేడుకలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపడుతున్నామన్నారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని ఏటా సెప్టెంబర్ 5వ తేదీన గురుపూజోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ నెల 5న జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించే వేడుకల్లో కలెక్టర్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, టీచర్లు పాల్గొంటారని డీఈఓ వెల్లడించారు.

జాబ్‌మేళాలో 55 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో నిర్వాహకులు

పలమనేరు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, డీఆర్‌డీఏల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జరిగిన జాబ్‌మేళాలో 55 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికై నట్టు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.బాబు తెలిపారు. జాబ్ మేళాకు 149 మంది హాజరుకాగా ఇంటర్వ్యూల్లో 55 మంది సెలెక్ట్ అయినట్టు పేర్కొన్నారు. ఎంపికై న వారు ఐసీఐసీఐ బ్యాంకు, ఎస్‌ఐటీ, సుగుణపౌల్ట్రీ, డిక్సన్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి సీడాప్ జేడీఎం సరితా రెడ్డి, ఏపీఎం సెల్వరాజన్, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి చైతన్య, ఇక్కడి కోఆర్డినేటర్ సిసింద్రి, వైస్ ప్రిన్సిపల్ షణ్ముగం పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు, హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారు.

9న వార్షిక వర్క్‌షాప్

చిత్తూరు కలెక్టరేట్ : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా సెక్రెటరీలకు, ఒకేషనల్ ఎడ్యుకేషనల్ అధికారులకు ఈ నెల 9వ తేదీన వార్షిక వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. డీఈఓ కార్యాలయానికి అందిన ఆ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రస్థాయి క్రీడల నిర్వహణ వేదికలు, వ్యాయామ ఉపాధ్యాయులకు ఓరియెంటేషన్‌కు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌నకు సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

తిరుమలలో రద్దీ సాధారణం

తిరుమల: తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 63,936 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 18,697 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.55 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. టిక్కెట్లు లేనివారికి 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 2 గంటల్లో తిరుమలేశుని దర్శించుకోగలుగుతున్నారు. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

వసతి..అధోగతి

గ్రౌండ్ రిపోర్ట్ / GROUND REPORT

● పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లె బీసీ బాలుర వసతిగృహాన్ని గురువారం రాత్రి పరిశీలించినప్పుడు.. వార్డెన్ లేరు. వాచ్‌మెన్ నలుగురు పిల్లలతో కూర్చుని ట్యాబ్‌లో సినిమాలు చూపిస్తున్నారు. ప్రభుత్వం దుప్పట్లు ఇవ్వకపోవడంతో ఐదుగురు విద్యార్థులు ఒకటే దుప్పటి కప్పుకుంటున్నారు. 34 మంది విద్యార్థులకు గానూ 32 మంది విద్యార్థులు మాత్రమే వసతి గృహంలో ఉండగా, అటెండెన్స్ రిజిస్టర్‌లో మాత్రం 34 మంది నమోదు చేశారు. మిగిలిన ఇద్దరు విద్యార్థులు ఇక్కడ లేరే అని ప్రశ్నిస్తే సిబ్బంది నీళ్లు నమిలారు.



ఒకే దుప్పటిని కప్పుకున్న ఐదుగురు విద్యార్థులు

● జిల్లాకేంద్రంలో సంజయ్‌గాంధీ నగర్‌లోని గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని గురువారం మధ్యాహ్నం పరిశీలించినప్పుడు.. గిరిజన విద్యార్థులు 38 మంది ఉంటున్నారు. కిటికీలకు మెష్‌లు లేవు. ప్రాంగణాలు, మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేక దుర్గంధం చిమ్ముతున్నాయి. విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు ఇవ్వలేదు. రాత్రిపూట వాచ్‌మెన్ లేరు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు. కిటికీలకు మెష్‌లు లేకపోవడంతో దోమల మోతతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.



గిరిజన వసతి గృహంలో మెష్‌లు లేని కిటికీలు



శిథిలావస్థకు చేరిన బంగారుపాళ్యం గురుకుల పాఠశాల

ప్రభుత్వ వసతి గృహాల్లో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా కూటమి ప్రభుత్వం విద్యార్థుల గురించి ఆలోచించడం లేదు. కనీస సదుపాయాలు కల్పించడంలో సర్కారు మొండిచేయి చూపుతోంది. సంక్షేమ హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు కనీసం కప్పుకోవడానికి దుప్పట్లు లేవు. ఇంతవరకు కాస్మొటిక్ చార్జీలు ఇవ్వడం లేదు. హాస్టల్ వార్డెన్లను, ప్రిన్సిపల్స్‌ను ఏదైనా అడిగితే ప్రభుత్వం ఇస్తే కదా మీకు ఇచ్చేదని విద్యార్థులపై కస్సు మంటున్నారు.

- సంక్షేమ వసతిగృహాల్లో విలయతాండవం చేస్తున్న సమస్యలు
- కనీస వసతులు, మరమ్మతులకూ నోచుకోని హాస్టళ్లు
- కాస్మొటిక్ చార్జీలు, కప్పుకోవడానికి దుప్పట్లు ఇవ్వని సర్కారు
- మెనూ ప్రకారం భోజనం సరేసరి
- దోమల ధాటికి జ్వరాల బారిన పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు
- నిధులు లేవంటున్న వార్డెన్లు, గురుకుల ప్రిన్సిపల్స్



నీళ్ల సాంబారు అన్నం తింటున్న పాలసముద్రం వసతిగృహం విద్యార్థులు

జిల్లా వివరాలు..

ఎస్టీ వసతి గృహాలు	3
ఎస్సీ వసతి గృహాలు	57
ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకులాలు	7
ఏపీ రెసిడెన్షియల్ గురుకులాలు	2
ట్రైబల్ గురుకులాలు	4
కేజీబీవీలు	13
మహాత్మాగాంధీ పూలే గురుకులాలు	5
బీసీ సంక్షేమ వసతి గృహాలు	38



బంగారుపాళ్యం ఎస్టీ వసతి గృహంలో మరమ్మతులకు గురైన ఆర్‌ఓ ప్లాంట్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లావ్యాప్తంగా ఉన్న గురుకుల, కేజీబీవీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల వసతి గృహాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. వసతి గృహాల నిర్వహణ, విద్యార్థుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం గాలికొదిలేయడంతో సమస్యలతో సతమతమవుతున్నారు. అపరిశుభ్రమైన ప్రాంగణాల్లోనే విద్యార్థులు బస చేయాల్సిన వస్తుండడంతో రోగాల బారిన పడుతున్నారు. మరోవైపు ప్రాంగణాలు పరిశుభ్రంగా పెట్టుకునేందుకు అవసరమైన బ్లీచింగ్, ఇతరత్రా వస్తువుల కొనుగోలుకు నిధులు లేవని వార్డెన్లు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్స్ సమస్యలను ఏకరువు పెడుతున్నారు. ఉదయం, రాత్రి పూట మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టడం లేదు. విద్యార్థులకు కనీస అవసరాలైన సబ్బులు, టూత్‌పేస్టులు, కొబ్బరినూనె తదితర అవసరాలకు చెల్లించే కాస్మొటిక్ చార్జీలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు ఒకే సోపు, టూత్‌పేస్టును అవసరాలకు పంచుకుంటున్నారు. ఇక గురుకుల పాఠశాలల్లో వంటావార్పునకు సంబంధించి గ్యాస్ సిలిండర్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ప్రిన్సిపల్స్ చేతి నుంచి నెలకు రూ.30 వేల వరకు ఖర్చు పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లావ్యాప్తంగా గురుకుల పాఠశాలలు, కేజీబీవీ, సంక్షేమ వసతి గృహాల్లో సాక్షి నిర్వహించిన విజిట్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వసతి గృహాల్లో తిష్ట వేసిన సమస్యలు కొట్టొచ్చినట్లు కనిపించాయి.

చేతి నుంచి ఖర్చు చేయాల్సిన దుస్థితి

కూటమి ప్రభుత్వంలో సంక్షేమ, గురుకుల పాఠశాలల్లో మెయింటెనెన్స్ బడ్జెట్‌ను విడుదల చేయకపోవడంతో ప్రిన్సిపల్స్, వార్డెన్లు చేతి నుంచి ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. సంక్షేమ వసతి గృహాల్లో నెలల కొద్ది బిల్లుల పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాకేంద్రంలోని ఒక గురుకుల పాఠశాలలో ఇప్పటి వరకు రూ.2 లక్షలు ప్రిన్సిపల్ పాఠశాల కోసం ఖర్చు చేసినట్లు వెల్లడించారు. మరో గురుకుల పాఠశాలలో టీచర్లు కొద్దికొద్దిగా నగదును వేసుకుని ఖర్చులు పెడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు తమకేమీ తెలియనట్టు మిన్నకుంటున్నారు.

- జిల్లావ్యాప్తంగా గిరిజన సంక్షేమ వసతి గృహాలు 3 ఉన్నాయి. అందులో 261 మంది విద్యార్థులకు గానూ 36 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. మిగిలిన 225 మంది విద్యార్థులు ఇంటి బాట పట్టారు.
- సాంఘిక సంక్షేమ వసతి గృహాలు 57 ఉండగా అందులో 3458 విద్యార్థులు ఉండాలి. అయితే 2739 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు.
- సాంఘిక సంక్షేమ డా.బీఆర్.అంబేడ్కర్ గురుకులాలు మొత్తం 07 పాఠశాలల్లో 3537 మంది విద్యార్థులకు గానూ, 2744 మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన 793 మంది విద్యార్థులు అనారోగ్యంతో ఇళ్లకు వెళ్లిపోయారు.
- జిల్లాలోని 2 ఏపీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలల్లో 651 మందికి 464 మంది, ట్రైబల్ గురుకుల 04 పాఠశాలల్లో 613 మందికి 286 మంది, కేజీబీవీ పాఠశాలల్లో 2592 మందికి 2470 మంది, మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో 1166 మందికి 1002 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు.



చిత్తూరులోని గిరిజన సంక్షేమ వసతి గృహం



పుంగనూరు కేజీబీవీలో చీమలమయమైన సరుకులు

పరిసరాలు అపరిశుభ్రంగా..

వసతి గృహాల్లో మురుగునీరు నిల్వ ఉండడంతో దుర్గంధంతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో దోమలు పెరిగిపోయి విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారు. జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులను సీక్ రూంలలో ఉంచి చికిత్స అందించి పరిస్థితి విషమిస్తే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాల్సిన కోడిగుడ్లు, చికెన్ కూడా చాలీచాలనట్లు అందిస్తున్నారు. గదుల్లో విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు లేకపోవడంతో విద్యార్థులు చీకటి గదుల్లో బిక్కుబిక్కుమంటూ అలాగే పడుతుకుంటున్నారు. చీకట్లో దోమలు ఒకవైపు, ఎలుకలు మరోవైపు దాడి చేస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.



సంజయ్‌గాంధీ నగర్‌లోని ఎస్సీ వసతి గృహం ప్రాంగణంలో పిచ్చిమొక్కలు



చిత్తూరు బీసీ వసతి గృహంలో తలుపులు లేని మరుగుదొడ్లు



అపరిశుభ్రంగా చిత్తూరులోని గిరిజన వసతి గృహం

పర్యవేక్షణ కరువు..

విద్యార్థుల భద్రతను సంక్షేమ వసతి గృహాల అధికారులు గాలికి వదిలేశారు. నిబంధనల ప్రకారం వసతి గృహాలను తనిఖీ చేయాల్సిన ఏబీసీడబ్ల్యూఓ, ఏఎస్‌డబ్ల్యూఓలు, జిల్లా సంక్షేమ శాఖల అధికారులు ఇతర పనుల్లో పడి పర్యవేక్షణ చేయడం లేదు. ఉన్నతాధికారులు వసతి గృహాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో వార్డెన్లు కూడా తమను ఎవరేం చేస్తారులే అనే ధోరణిలో ఉన్నారు. చాలాచోట్ల విద్యార్థులు తక్కువగా ఉన్నప్పటికీ అటెండెన్స్ రిజిస్టర్లలో ఎక్కువ ఉన్నట్లు దొంగలెక్కలు చూపించి నిధులు నొక్కేసే ప్రయత్నాలు చేస్తున్నారు. సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లతో కుమ్మకై పర్సంటేజీలకు ఆశ పడుతున్నారు.

కునారిల్లుతున్న వసతి గృహాలు..

జిల్లావ్యాప్తంగా గిరిజన వసతి గృహాలు 3, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు 57, సాంఘిక సంక్షేమ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాలు 7, ఏపీ రెసిడెన్షియల్ గురుకులాలు 2, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గురుకులాలు 4, కేజీబీవీ బాలికల విద్యాలయాలు 13, మహాత్మాగాంధీ బీసీ రెసిడెన్షియల్ గురుకులాలు 5, బీసీ సంక్షేమ వసతిగృహాలు 38, మైనారిటీ వసతి గృహం 1 ఉన్నాయి. దేశంలోనే ఆదర్శంగా సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పిస్తామని కూటమి ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించింది. అయితే చేతుల్లో చూపుతున్న నిర్లక్ష్యం వల్ల గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు సమస్యలతో కునారిల్లుతున్నాయి.

అన్నీ అసౌకర్యాలే..



జిల్లావ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతి గృహాల్లో అన్నీ అసౌకర్యాలే. ఇటీవల తమ సంఘం ఆధ్వర్యంలో వసతి గృహాలను పరిశీలించాం. విద్యార్థులు అధికంగా సమస్యలు వెల్లడించారు. సరైన మరుగుదొడ్లు లేవు, ట్యూటర్లు లేరు. పూర్తిస్థాయిలో వార్డెన్లు లేకపోవడంతో ఒకరే మూడు వసతి గృహాలను పర్యవేక్షిస్తున్నారు. చాలా వసతి గృహాల్లో విద్యార్థులు జ్వరాల బారిన పడి ఇళ్లకు వెళ్లిపోయారు.

– ప్రవీణ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్

కాస్మొటిక్ చార్జీలు ఇవ్వడం లేదు



చాలా నెలలుగా మాకు కాస్మొటిక్ చార్జీలు ఇవ్వడం లేదు. దీంతో చాలా ఇబ్బందిగా ఉంది. ఇంట్లో తల్లిదండ్రులను అడుగుదామంటే దూరంగా ఉన్నారు. ఇంటికి వెళ్లేందుకు వీలుపడదు. వార్డెన్ సర్‌ను అడిగితే ప్రభుత్వం ఇస్తేనే కదా ఇచ్చేకి వీలవుతుంది అని అంటున్నారు.

– కుమార్, బీసీ వసతి గృహం విద్యార్థి, పాలసముద్రం

భయంగా ఉంది



మా సమస్యలు చెప్పుకోవాలంటే భయంగా ఉంది. వార్డెన్ సర్‌కు తెలిస్తే అంతే సంగతులు. నన్ను ఇంటికి పంపిస్తారు. చన్నీటితో స్నానం చేస్తున్నాం. రాత్రి పూట దోమలు కుడుతున్నాయి. మరుగుదొడ్లను శుభ్రం చేయించాలి. మెనూ ప్రకారం భోజనం పెట్టాలి. ఇప్పుడు చాలా నెలలుగా మాకు కాస్మొటిక్ డబ్బులు ఇవ్వడం లేదు.

– కిషోర్, బీసీ వసతి గృహం విద్యార్థి, పాలసముద్రం

వరదల్లో విద్యుత్ ఉద్యోగుల సేవలు



విజయవాడలో విద్యుత్‌పనులను పరిశీలిస్తున్న సీఎండీతో ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: భారీ వరదల కారణంగా విజయవాడలో పరిస్థితులు దయనీయంగా మారాయి. చాలాచోట్ల విద్యుత్ సరఫరా పూర్తిగా తెగిపోయాయి. దీంతో విద్యుత్ పునరుద్ధరణకు ట్రాన్స్‌కో సర్కిల్ పరిధిలో అధికారులు, సిబ్బంది 200 మంది విజయవాడకు సోమవారం వెళ్లారు. సీఎండీ సంతోషరావు నేతృత్వంలో, ఈఈలు వాసురెడ్డి, అమర్ బాబు, దామోదారం, మహేశ్వర్‌రెడ్డి డీఈ, ఏఈలు సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పడి పలు ప్రాంతాల్లో సంరక్షణ పనులు చేపట్టారు. నీటి ప్రవాహం తగ్గిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులు చేయించమని అధికారులు తెలిపారు. వారం రోజుల పాటు అక్కడి ఉండి పనులు చేయనున్నట్లు ఎస్‌ఈ సురేంద్రనాయుడు వివరించారు.

నేటి యుగంలో సైన్స్‌కు ప్రాధాన్యత



వివిధ కళాశాలల నుంచి పాల్గొన్న విద్యార్థులు



విద్యార్థులకు ప్రయోగాలను చేసి చూపుతున్న శాస్త్రవేత్త

● పీవీకేఎన్‌లో నేషనల్ వర్క్‌షాప్

చిత్తూరు కలెక్టరేట్ : ఆధునికయుగంలో సైన్స్‌కు అత్యంత ప్రాధాన్యత ఉన్నట్లు పీవీకేఎన్ ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి అన్నారు. మంగళవారం కళాశాలలో ఒకరోజు నేషనల్ వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి చూపించాలన్నారు. ప్రస్తుతం సైన్స్ విభాగంలో పరిశోధనలు అత్యంత కీలకమని పరిశోధనల వైపు విద్యార్థులు ఆసక్తి చూపిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రత్యేక అతిథి ఇందిరా గాంధీ అణు పరిశోధన కేంద్రం ప్రొఫెసర్ బ్రహ్మనందం మాట్లాడుతూ విద్యార్థులు, పరిశోధకులు సైన్స్‌రంగంలో కొత్త అధ్యయనాలను ప్రారంభించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఐజీసీఏఆర్ ప్రొఫెసర్ రామనాథన్ మాట్లాడుతూ రసాయనిక శక్తి వినియోగం సురక్షితంగా ఉండేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందాలన్నారు. శాస్త్రవేత్త పిచ్చయ్య మాట్లాడుతూ అణురంగంలో విద్యార్థులు చక్కని అవకాశాలను అన్వేషించాలన్నారు. అనంతరం ప్రయోగాలను చేసి చూపించి, వారు అడిగిన ప్రశ్నలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ భానుప్రకాష్, సైన్స్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పూరి గుడిసె దగ్ధం



కాలిపోయిన పూరి గుడిసె

పుత్తూరు: పట్టణ పరిధిలోని గంగమాంబాపురం గ్రామంలో వెంకటేష్‌కు చెందిన పూరిగుడిసె మంగళవారం కాలిపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గుడిసె పూర్తిగా కాలిపోయినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. మంటల్లో 25 కేజీల బియ్యం, రూ.3 వేల నగదు, దుస్తులు కాలిపోయినట్లు వాపోయారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

చిత్తూరు తహసీల్దార్‌కు ఉద్యోగోన్నతి

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు తహసీల్దార్ కళావతికి డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వుల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 32 మందికి ఉద్యోగోన్నతి కల్పించారు. ఇందులో చిత్తూరు తహసీల్దార్ ఒకరు. త్వరలో ఆమె డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి



ప్రమాదంలో మృతి చెందిన భగత్ పూజారి

చంద్రగిరి: ప్రమాదవశాత్తు ట్రాక్టరు బోల్తా పడి ఒడిశాకు చెందిన వలస కార్మికుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని ముంగిళిపట్టు సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఐతేపల్లి అయ్యప్ప స్వామివారి ఆలయ సమీపంలోని ఓ సిమెంట్ బ్రిక్స్ వద్ద ఒడిశాకు చెందిన భగత్ పూజారి(28) కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం కూలీలతో కలసి సిమెంటు బ్రిక్స్ లోడుతో ట్రాక్టర్‌ను తీసుకుని భగత్ పూజారి ముంగిళిపట్టు జగనన్న కాలనీకి బయల్దేరాడు. కాలనీ సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న భగత్ పూజారి ట్రాక్టర్ ఇంజిన్ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, ప్రమాదానికి గల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. దీనిపై ఎస్ఐ అనితను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. అయితే ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ కేవలం వ్యవసాయానికి సంబంధించి మాత్రమే వినియోగించాల్సి ఉందని స్థానికులు చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాల లావాదేవీలకు ట్రాక్టర్‌ను వినియోగిస్తున్నారని, ట్రాక్టర్‌కు సంబంధించి ఎటువంటి పత్రాలు లేకపోవడంతో, ఘటన స్థలం నుంచి ట్రాక్టర్‌ను మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

తరలిపోతున్న కలప..

పలమనేరు నియోజకవర్గం కర్ణాటక సరిహద్దులో ఉండడంతో అక్రమ వ్యాపారాలకు అడ్డాగా మారింది. కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం, గంజాయి రవాణా చేసే వారే ఎక్కువ. అయితే ఇటీవల కాలంలో పలమనేరు నుంచి కలప అక్రమ వ్యాపారం భారీగా జరుగుతోంది. పెద్దఎత్తున చెట్లను నరికి సామిల్లులకు తరలిస్తున్నారు. అంతేగాకుండా ఇటుక బట్టీలను కాల్చేందుకు కలపను వినియోగిస్తున్నారు. పలమనేరులో వాల్టా చట్టం ఉన్నా లేనట్లే అన్నట్లు తయారైంది.

- నేలకూలుతున్న పచ్చటి చెట్లు
- అక్రమంగా సామిల్లులకు చేరుతున్న వైనం
- మరికొన్ని చోట్ల ఇటుక బట్టీల్లో కాలి బూడిదవుతోంది
- పట్టపగలే ట్రాక్టర్లలో కలప అక్రమ రవాణా
- వాల్టా చట్టాన్ని గాలికొదిలేసిన అధికారులు

పలమనేరు: నియోజకవర్గంలో కొందరు అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా పచ్చటి వృక్షాలను నేలకూల్చి సామిల్లులకు అక్రమరవాణా చేస్తున్నారు. ఇంకొందరు ఇటుక బట్టీలను కాల్చేందుకు కలపగా చెట్లను వాడుతున్నారు. ఈ వ్యాపారంలో కొందరు పచ్చనేతలు తాజాగా రంగంలోకి దిగినట్టు తెలిసింది. వీరు రైతుల పొలాల్లోని చెట్లు, ప్రభుత్వభూములు, ఆలయమాన్యాల్లోని వృక్షాలను సైతం వదలడం లేదు. నియోజకవర్గంలో పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో పచ్చటి చెట్లు అంతరించిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. మొక్కలను నాటి పర్యావరణాన్ని పెంపొందించాలని ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోంది. చెట్లను నరక్కుండా ప్రభుత్వం అమలు చేస్తున్న వాల్టా చట్టం సక్రమంగా అమలు కావడం లేదు. వాల్టా చట్టాన్ని అమలు చేయాల్సిన అటవీ, రెవెన్యూ, ఎంపీడీవో అధికారులు పట్టించుకోలేదనే మాటలు వినిపిస్తున్నాయి.



వీకోట వైపునకు వెళ్లేందుకు ట్రాక్టరులో సిద్ధంగా ఉన్న కలప(ఫైల్)

జోరుగా కలప వ్యాపారం..

నియోజకవర్గంలోని ప్రభుత్వ భూములు, పోరంబోకు స్థలాలతో పాటు రైతుల పంటపొలాల్లో వృక్షాలు భారీగా ఉన్నాయి. ఇటుకల బట్టీల్లో ఇటుకలను కాల్చేందుకు కలప అవసరం. దీంతో పాటు పలు రకాల ఇంటి నిర్మాణ పరికరాల కోసం కలపకు స్థానికంగా మంచి డిమాండ్ ఏర్పడింది. దీనికి తోడు మండల కేంద్రాల్లోని సామిల్లుల్లో సీజన్‌తో సంబంధం లేకుండా కలపను కొంటున్నారు. డిమాండ్ దృష్ట్యా కొందరు కలప వ్యాపారమే వృత్తిగా చేసుకున్నారు. చెట్లను రహస్యంగా నరకడం వాటిని దాచిపెట్టి రాత్రి, పగలనే తేడాలేకుండా తరలిస్తున్నారు. నియోజకవర్గంలో దాదాపు 40మంది ఇదే వ్యాపారాన్ని సాగిస్తున్నారు. ఈ కలప వీకోట, తమిళనాడుకు చేరుతున్నట్టు సమాచారం.

నియోజకవర్గంలో ఇటుక బట్టీల పరిస్థితి ఇలా...

- మొత్తం ఇటుక బట్టీలు: 300 దాకా
- ఓ బట్టీకి అవసరమైన కలప: ఏడు ట్రాక్టర్ లోడ్లు(ట్రాక్టర్‌కు 5 టన్నుల చొప్పున 35 టన్నులు)
- ప్రస్తుతం టన్ను కలప ధర రూ. 15వేలు(కట్ చేసిన కూలితో కలిపి)
- సీజన్‌లో కాలి బూడిదవుతున్న కలప: 12,600 టన్నులు

వాల్టా చట్టం.. ప్రయోజనం లేదు..

చెట్లను నరక్కుండా ఉండేందుకు ప్రభుత్వం ఏపీ వాల్టా యాక్టు 2002(ఆంధ్రప్రదేశ్ వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్టు)ను అమలు చేస్తోంది. దీని ప్రకారం ఎవరైనా రైతులు పట్టా భూముల్లోని చెట్లను కొట్టాలన్నా రెవెన్యూ, ఫారెస్ట్ అధికారుల నుంచి అనుమతులు పొందాల్సి ఉంది. నరికిన చెట్ల స్థానంలో అంతకుమించి మొక్కలను నాటాలి. అయితే సంబంధిత రెవెన్యూ గ్రామాల పరిధిలోని వీఆర్వోలు దీని గురించి పట్టించుకోవడం లేదు. ఫారెస్ట్ అధికారులు పటిష్టంగా చర్యలు తీసుకోవడం లేదు. తీసుకుందామన్నా అక్రమార్కులకు అధికార నేతల అండదండలు ఉన్నాయనే మాట వినిపిస్తోంది. దీంతో లక్షలాది రూపాయల విలువైన కలప అక్రమంగా తరలుతోంది.

టీచర్.. మమ్మల్ని విడిచి వెళ్లొద్దు ప్లీజ్..

- ఉపాధ్యాయురాలి ఎదుట కన్నీటి పర్యంతమైన విద్యార్థులు

గంగవరం: ''ఇంతకాలం మమ్మల్ని ఎంతో ప్రేమగా చూసుకున్నావు కదా మేడమ్.. మాకు మంచిగా పాఠాలు చెప్పారు.. మిమ్మల్ని విడిచి ఉండలేం మేడమ్.. ఇంకే టీచర్ మాకు వద్దు.. మీరు ఇక్కడే ఉండండి.. మమ్మల్ని విడిచి వెళ్లొద్దు మేడం '' అంటూ విద్యార్థులు కన్నీరు పెట్టుకోవడంతో అందరి కళ్లు చెమర్చే సంఘటన గంగవరం మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని కీలపట్ల ప్రాథమిక పాఠశాలకు మూడేళ్ల కిందట ఉపాధ్యాయురాలు తేజోవతి విధుల్లో చేరారు. ఈమె ఇక్కడ చేరిన నాటి నుంచి విద్యార్థినులకు ప్రేమగా, అర్థమయ్యేలా విద్యాబోధన చేసి ఆకట్టుకునేవారు. దానికితోడు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు పిల్లలతో కలిసి చేపట్టడంతో పాటు వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేవారు. దీంతో ఆ టీచర్ పట్ల విద్యార్థులు కూడా ప్రత్యేక మమకారం పెంచుకున్నారు. అయితే రాష్ట్రప్రభుత్వం ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా ఆమెను మరో పాఠశాలకు బదిలీ చేసింది. మంగళవారం స్కూల్‌లో టీచర్ తేజోవతికి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు టీచర్ వెళ్లిపోతోందన్న ఆవేదన భావోద్వేగానికి లోనయ్యారు. తమను విడిచి వెళ్లవద్దని టీచర్ ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. ఆ విద్యార్థులను చూసి ఉపాధ్యాయురాలు సైతం కంటతడి పెట్టుకున్నారు. మా మేడం మా దగ్గరే ఉండాలి.. అంటూ పాఠశాల ఎదుట విద్యార్థులు ధర్నా చేశారు. గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో పాఠశాల వద్దకు ఎంఈఓ-1 వేణుగోపాల్‌రెడ్డి చేరుకుని ఉపాధ్యాయురాలి బదిలీ ఆపడం తన చేతుల్లో లేదన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.



కంటతడి పెడుతున్న ఉపాధ్యాయురాలు

వరద బాధితులకు చేయూత

శ్రీరంగరాజపురం : విజయవాడలో కురిసిన భారీ వర్షాలకు ఆ ప్రాంతం మొత్తం జలమయం అవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద బాధితులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా నాయకురాలు, గంగాధరనెల్లూరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి ఆహార ప్యాకెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా విజయవాడ నగరం వర్షానికి అతలాకుతలం కావడంతో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో తన సిబ్బంది ద్వారా దాదాపు 3500 మందికి ఆహారం, వాటర్ బాటిళ్లు, పాలు, బిస్కెట్ ప్యాకెట్లు అందించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రజలకు ఏ విపత్తు వచ్చినా వైఎస్సార్‌సీపీ అన్ని విధాలుగా ఆదుకోవడానికి సిద్ధంగా ఉందని తెలిపారు.



వరద బాధితులకు ఆహారం సిద్ధం చేస్తున్న సిబ్బంది

13 నుంచి శ్రీకాళహస్తిలో పవిత్రోత్సవాలు

శ్రీకాళహస్తి రూరల్ : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరగనున్నట్లు ఆలయ ఈఓ ఎస్‌వీఎస్ఎస్ మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో భక్తుల వల్ల కానీ, సిబ్బంది వల్ల కానీ ఏదైనా తెలియని అపచారం జరిగి ఉంటే వాటికి పరిహారంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కొడుకు మందలించాడనే..

తిరుపతి తుడా : తిరుపతి స్విమ్స్ శ్రీపద్మావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అదృశ్యమైన రోగిని ఎట్టకేలకు కనిపెట్టారు. ఈ మేరకు వెస్ట్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలోని బృందం మంగళవారం రుయాలోని ఎంఎం వార్డులో రోగి సీతారామప్ప చికిత్సపొందుతున్నట్లు గుర్తించారు. వివరాలు.. రామసముద్రం మండలం బొరవమాకులపల్లెకు చెందిన సీతారామప్ప (68) అనారోగ్యం బారిన పడడంతో కుటుంబీకులు ఆగస్టు 27వ తేదీన స్విమ్స్‌లో చేర్పించారు. 28వ తేదీన ఎవరికీ చెప్పకుండా ఆస్పత్రి నుంచి వెళ్లిపోయాడు. అయితే కుటుంబ సభ్యులు మాత్రం ఆస్పత్రి యాజమాన్యంపై ఆరోపణలు చేశారు.. అధికారులు నర్సులు సెక్యూరిటీ నిర్లక్ష్యం వల్లే సీతారామప్ప వెళ్లిపోయాడంటూ గందరగోళం సృష్టించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, టీడీపీ నేత పరసారత్నంతో కలిసి ఆస్పత్రి వద్ద ధర్నాకు దిగారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి రోగిని పట్టుకునేందుకు మూడు బృందాలుగా ఏర్పడి వారం రోజులపాటు పలు ప్రాంతాల్లో గాలించారు. తీరా ఆయన రుయా ఆస్పత్రిలోని ఎంఎం వార్డులో చికిత్స పొందుతున్నట్లు గుర్తించారు. తన కొడుకు విశ్వనాథ్ మందలించడంతోనే మనస్తాపానికి గురై ఎవరికి చెప్పకుండా స్విమ్స్ నుంచి వచ్చేసినట్లు ఆయన పోలీసులకు తెలిపారు. వారం రోజులుగా సాగిన హైడ్రామాకు తెరపడడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



సీతారామప్పతో వెస్ట్ సీఐ రామకృష్ణ

భర్తను చంపిన భార్యకు జీవిత ఖైదు

తిరుపతి లీగల్ : భర్తను హత్య చేసిన భార్యకు జీవితఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జిల్లా జడ్జి అర్చన మంగళవారం తీర్పు నిచ్చారు. వివరాలు.. శ్రీ భాష్యం వసుంధర తన భర్త ఎస్.రవిచంద్రతో కలిసి ప్రకాశం జిల్లా గిద్దలూరు నుంచి వ్యాపారరీత్యా రేణిగుంటకు వచ్చింది. వారికి మానసిక వైకల్యంతో బాధపడుతున్న కుమారుడు ఉన్నాడు. రవిచంద్ర అప్పటికే కొన్ని వ్యాపారాలు చేసి నష్టపోయాడు. పలువురు మహిళలతో వివాహేతర సంబంధాలు సాగిస్తూ ఇంట్లో భార్యను వేధించేవాడు. కుటుంబ అవసరాలు పట్టించుకోకుండా నిత్యం వేధిస్తూ ఉండడంతో తట్టుకోలేకపోయిన వసుంధర కత్తితో రవిచంద్రను పొడిచి హత్య చేసింది. అనంతరం తల నరికి సంచిలో వేసుకుని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయింది. ఈ క్రమంలో కేసు విచారించిన కోర్టు ఆమె చేసిన నేరం రుజువు కావడంతో శిక్ష విధించింది. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ విజయలక్ష్మి వాదించారు.

కొత్త సార్ వచ్చాకే బదిలీలా..!

- పంచాయతీ రాజ్ ఉద్యోగుల బదిలీల్లో సందిగ్ధం
- జెడ్పీ సీఈఓ, డీపీఓ బదిలీలపై ఊహాగానాలు
- కొత్త అధికారుల నేతృత్వంలోనే బదిలీలు జరగవచ్చని ప్రచారం
- సీఎం సమీప బంధువు జెడ్పీ సీఈఓగా రావొచ్చని ఊహాగానాలు

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీరాజ్ విభాగంలో ఉద్యోగుల బదిలీలపై కొంత సందిగ్ధం నెలకొంది. రాష్ట్రప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు విడుదల చేసిన నేపథ్యంలో జెడ్పీ పరిధిలో 297 మంది, డీపీఓ పరిధిలో 198 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. అధికార బృందం దరఖాస్తులను పరిశీలించి సీనియారిటీ ప్రకారం జాబితాలు సిద్ధం చేశారు. అయితే బదిలీలను పర్యవేక్షించాల్సిన జెడ్పీ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారి బదిలీలు ఏ క్షణమైనా బదిలీపై వెళ్లే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు ఊపందుకున్నాయి. వీరి స్థానంలో కొత్తవారు వచ్చాకే ఉద్యోగులకు స్థాన చలనం కల్పించనున్నట్లు ప్రచారం సాగుతోంది.

సమయం పెంపుతో బలం..

ఆగస్టు 31 నాటికి బదిలీల ప్రక్రియ పూర్తయి సెప్టెంబర్ 2 నుంచి ఉద్యోగులు కొత్త ప్రాంతాల్లో బాధ్యతలు చేపడతారని మొదట విడుదల చేసిన బదిలీల జీఓ ప్రకారం ఉద్యోగులు అనుకున్నారు. కానీ ఈనెల 15 వరకు బదిలీల గడువు పొడిగించిన విషయం తెలిసిందే. దీంతో కొందరు ఆశావాహులు తిరిగి రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్స్ కోసం వినతులు ఇస్తున్నారు. ఇదివరకే గ్రామీణ విభాగం పరిధిలో కీలకమైన జెడ్పీ సీఈఓ, డీపీఓ పోస్టుల కోసం ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రకాశం జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎంగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ క్యాడర్‌లో ఉన్న గ్లోరియా బదిలీపై చిత్తూరు జెడ్పీ సీఈఓగా ఫిబ్రవరిలో బాధ్యతలు స్వీకరించారు. మదనపల్లె డీఎల్‌పీఓ లక్ష్మి బదిలీపై గతంలో చిత్తూరుకు వచ్చారు. అప్పట్లో డీపీఓగా ఉన్న దశరథరామిరెడ్డి బదిలీ కావడంతో ఆమెకు అదనంగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పజెప్పారు. దీంతో ఈ రెండు పోస్టులకు నేడో, రేపో బదిలీ ఉత్తర్వులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. పైగా కొత్తగా వచ్చే అధికారుల నేతృత్వంలోనే ఉద్యోగుల బదిలీలు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి మౌఖిక ఆదేశాలు అందినట్లు సమాచారం. దీంతో బదిలీల కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగుల్లో కొంత నిరాశ కనిపిస్తోంది. ఇప్పటికే బదిలీలకు అర్హులైన వారు, రిక్వెస్ట్ బదిలీలను కోరుతున్న వారు తమకు అనుకూలమైన ఎమ్మెల్యే, ఎంపీల నుంచి సిఫార్సు చేయించుకున్నారు. బదిలీల అంకం చివరి దశకు చేరుకున్న తరుణంలో ఆయా శాఖలకు చెందిన అధికారులకు బదిలీలు తప్పవనే ప్రచారం జోరందుకోవడం గమనార్హం. కొత్తగా వచ్చే అధికారులకు మరోసారి సంబంధిత ప్రజా ప్రతినిధుల చేత సిఫారసు చేయించుకోవాల్సి ఉంటుందని ఆందోళనకు గురవుతున్నారు.



జిల్లాపరిషత్ కార్యాలయం

సీఎం బంధువు రావొచ్చని ఊహాగానాలు..

జెడ్పీ సీఈఓగా సీఎం చంద్రబాబు బంధువైన రవికుమార్‌నాయుడు వస్తారని ఊహాగానాలు జోరందుకున్నాయి. గతంలో ఇక్కడ డీపీఓగా పనిచేసిన ప్రభాకర్‌రావు, నాగరాజునాయుడుతో పాటు జిల్లాలోని ఓ మహిళా అధికారి ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయని వినపడుతోంది. కానీ డీపీఓ పోస్టు పదిలమని కార్యాలయ సిబ్బంది చెబుతున్నా.. కొత్తవారి ప్రయత్నాలు మాత్రం ఆగడం లేదు. వీరితో పాటు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈల స్థానాలకు ప్రస్తుతం ఉన్నవారితో పాటు కొత్తవారు ప్రయత్నాలు చేస్తున్నారు.

పక్కా ప్రణాళికతోనే ఏటీఎం చోరీ

- కస్టోడియనే ప్రధాన సూత్రధారి
- ఇద్దరు నిందితుల అరెస్ట్.. మరొకరు పరార్
- రూ.6.56లక్షల సొత్తు స్వాధీనం
- ఎస్పీ సుబ్బరాయుడు వెల్లడి

తిరుపతి క్రైమ్ : జిల్లాలో సంచలనం రేపిన ఏటీఎం చోరీ కేసును చంద్రగిరి పోలీసులు ఛేదించినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. మంగళవారం తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆగస్టు 30వ తేదీ రాత్రి సమయంలో కోసూరి కాంప్లెక్స్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో చోరీ జరిగిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో గాదంకి టోల్‌గేట్ సమీపంలో ఉన్న రాధే హోటల్ ముందు నిందితులైన ఏటీఎం కస్టోడియన్ ఉద్యోగి కొంగర్ల సురేష్ బాబు, వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన జేసీబీ ఆపరేటర్ చదర్ల మనోజ్ కుమార్‌ను అరెస్ట్ చేశామని తెలిపారు. వీరిని విచారించగా ఆసక్తికరమైన విషయాలు బయటపడినట్లు వివరించారు. ఆయన మాటల్లోనే.. కస్టోడియన్‌గా పని చేస్తున్న సురేష్ బాబు కొంతకాలంగా కోసూరి కాంప్లెక్స్‌లో ఉన్న ఏటీఎంలో నగదు నింపే సమయంలో వ్యాన్ డ్రైవర్ మనోజ్ కుమార్‌తో కలిసి కొంత క్యాష్ అపహరించేవాడు. ఇటీవల సదరు వ్యాన్ డ్రైవర్ తన ఉద్యోగం వదిలేశాడు.

- బ్యాంకు ఆడిట్ జరుగుతుందని తెలియడంతో తన మోసం ఎక్కడ బయటపడుతుందో అని చందర్ల మనోజ్ కుమార్‌తో కలిసి ఏటీఎం చోరీకి కుట్ర పన్నాడు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

- ఈ మేరకు ఆగస్టు 23వ తేదీ నగదు నింపే సమయంలో ఏటీఎంకు తాళం వేయకుండా, డోరు మాత్రమే మూసివచ్చేశాడు.
- అనంతరం 30వ తేదీ అర్ధరాత్రి సురేష్, మనోజ్ కుమార్ కలిసి కారులో చంద్రగిరికి చేరుకున్నారు.
- సురేష్ కొంతదూరంలో ఉండగా, మనోజ్ కుమార్ అనుకున్న ప్రకారం సెక్యూరిటీ డ్రెస్ వేసుకొని మాస్క్, చేతులకు గ్లౌజులు ధరించి ఏటీఎం గదిలోకి ప్రవేశించాడు.
- డోరు తెరిచి అందులో ఉన్న నగదు మొత్తం రూ.2,53,500 దోచేశాడు. అనంతరం ఏటీఎంలో మొత్తం రూ.39,53,500 దొంగలించినట్లుగా చిత్రీకరించాడు.
- దీనిపై సురేష్‌ను విచారించగా ఏటీఎంలో ఇన్నాళ్లుగా దోచేసిన నగదులో కొంత జూదం, ఇతర వ్యసనాలకు ఖర్చుపెట్టినట్లు అంగీకరించాడు.
- రూ.8 లక్షలు క్యాష్ వాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న బుడ్డల మనోజ్ కుమార్ వద్ద ఉన్నట్లు వెల్లడించాడు. అయితే అతను పరారీలో ఉన్నాడు.
- పట్టుబడిన నిందితుల నుంచి రూ.5.38 లక్షల నగదు, మారుతి ఆల్టో కారు, ఎల్‌జీ రిఫ్రిజిరేటర్, రెండు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం మొత్తం రూ.6.59 లక్షల సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం

సెంటర్‌లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని ఎస్పీ తెలిపారు. బ్యాంకు ఏటీఎంలో నగదు ఎంత పెడుతున్నారు. ? ఎంత లావాదేవీలు జరుగుతున్నాయి.. ? అనే విషయం కూడా బ్యాంకు వారికి అర్థం కావడం లేదని చెప్పారు. ఇందులో బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా తెలుస్తోందన్నారు. త్వరలోనే బ్యాంక్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి భద్రతా చర్యలపై సూచనలు చేయనున్నట్లు వెల్లడించారు.

డ్రగ్స్ రహితంగా జిల్లా

జిల్లాను డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దుతామని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఈ మేరకు ట్రాఫిక్ రూల్స్, డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించేలా రూపొందించిన పోస్టర్‌ను ఏఎస్పీలు వెంకటరావు, రవి మనోహరాచారితో కలిసి ఆవిష్కరించారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

తిరుచానూరు(చంద్రగిరి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తెల్లపంచె, బనియన్ వేసుకుని సుమారు 60 సంవత్సరాల వయసున్న గుర్తు తెలియని వృద్ధుడు రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలోని రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. అనంతరం వెనుకనే మరో రెండు వాహనాలు మృతదేహంపై వెళ్లడంతో గుర్తుపట్టలేనంతగా తయారైంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు తిరుచానూరు పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ సాయినాథ్ తెలిపారు.

విజయవంతంగా వైద్య విద్యా సదస్సు

తిరుపతి తుడా : తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీలో మంగళవారం ఐపీసీ, జాతీయ ఫార్మాకో విజిలెన్స్ ఆదేశాల మేరకు ఔషధాల వాడకంతో తలెత్తే దుష్ప్రభావాలపై నిరంతర వైద్య విద్య సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు హాజరయ్యారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ రోగులు మందులను ఇష్టానుసారం వినియోగించకూడదన్నారు. వైద్యుల సూచన మేరకే వాడాలని కోరారు. రుయా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఔషధాలు, వాటి వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఔషధ విభాగాధిపతి డాక్టర్ ఆశాలత మాట్లాడుతూ ప్రతికూల ఔషధాల ప్రతి చర్యలను విశదీకరించారు. డాక్టర్ యు.భారతి, డాక్టర్ జి.సురేంద్ర కుమార్ మాట్లాడుతూ రోగి భద్రతలో మందుల ప్రాముఖ్యతను తెలిపారు. ఈ సందర్భంగా వైద్య, పారామెడికల్ విద్యార్థులకు పలు అంశాలపై క్విజ్, టెస్ట్‌లు నిర్వహించారు. అనంతరం ఫార్మసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు, ఫ్యాకల్టీలకు జ్ఞాపికలు అందజేశారు.